క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి, యడవల్లి, కట్టకూరు, మాదాపురం, మేడేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శిక్షణ కలెక్టర్ మయాంక్ అగర్వాల్ బుధవారం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లోని వసతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సెక్టార్ అధికారి విప్లవ్‌కుమార్, ఏఎస్సై సూర్యనారాయణలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం



అంగన్‌వాడీ టీచర్ అరుణకుమారిని సన్మానిస్తున్న దృశ్యం

ఏన్కూరు: రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న అంగన్‌వాడీ టీచర్ ముదిగొండ అరుణకుమారిని బుధవారం ఏన్కూరులో మున్నూరుకాపు సంఘం అధ్వర్యంలో సన్మానం చేశారు. గత 20 సంవత్సరాలు పలు కార్యక్రమాల్లో పాల్గొని అవార్డు సాధించిన అరుణకుమారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు పిన్ని వెంకటనారాయణ, ఆవుల సర్సయ్య, కోవూరు నాగేశ్వరావు, పాశం శ్రీనివాసరావు ముదిగొండ నాగేశ్వరావు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

మధిర: మధిర బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బుధవారం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల స్వీకరణ అనంతరం అధ్యక్ష, కోశాధికారి పదవులకు ఒకే నామినేషన్ దాఖలు కావటంతో అధ్యక్షుడిగా బోజడ్ల పుల్లారావు, కోశాధికారిగా కాకాని విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి చింతల గోపాల్ ప్రకటించారు. అదేవిధంగా మిగిలిన ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి పదవులకు ఎన్నిక ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వెంకటేశ్వర్లు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుపల్లి భాస్కర్, కంభం వీరభద్రం, ముత్తినేని వెంకటేశ్వర్లు, వెచ్చా మంగపతిరావు, యల్లంపల్లి చినఅప్పారావు, ఆలయ కమిటీ చైర్మన్లు నారగాని శ్రీనివాసరావు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

కారేపల్లి: జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కారేపల్లి మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు హర్షనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం కారేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు రమేష్, రాజేష్, రాజ్‌కుమార్, ఉపేందర్, పాషా పాల్గొన్నారు.

ఈ నెల 23న సర్వసభ్య సమావేశం

కొణిజర్ల: ఈ నెల 23(శనివారం)న మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రోజారాణి తెలిపారు. బుధవారం కొణిజర్లలో ఆమె మాట్లాడుతూ.. గత మూడు నెలల కాలంలో మండలంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష, రాబోవు వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలు గురించి సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అధికారులంతా తమ తమ అభివృద్ధి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని ఆమె సూచించారు.

ఆదరణ సేవా ఫౌండేషన్‌కు వస్తువులు వితరణ

చింతకాని: మధిర పట్టణంలో ఉన్నటువంటి ఆదరణ సేవా ఫౌండేషన్‌కు నారాయణ బెస్ట్ ఫౌండేషన్ స్కూల్ అధినేత బోనగిరి నారాయణ, పదో తరగతి విద్యార్థులు కలిసి పప్పు కుక్కరు, ఇడ్లీ పాత్రను బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆదరణ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి హారిణి వస్తువులను అందజేసిన నారాయణకు, పదో తరగతి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దే ఓటు



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో 80 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందని.. దీనికి దరఖాస్తు చేసుకోవాలని కల్లూరు ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం అఖిపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా ఎన్నికల పోలింగ్ కేంద్రాల వల్ల తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగించటం, కొత్త ఓట్లు వచ్చిన జాబితాలను వెల్లడించారు. పోలింగ్ బూత్‌లలో ఎక్కడైనా అసౌకర్యాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని, అందరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ యోగీశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, రాజకీయ పక్షాల నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, పసుమర్తి చందర్ రావు, కె.సర్వేశ్వరరావు, బొంతు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



వైరాలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



యాతాలకుంటలో అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ కొండమ్మ, సూపర్‌వైజర్ రజిని

వైరా: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైరా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. లయన్స్ వీడీజీ-2 నంబూరి మధు ముఖ్య అతిథిగా హాజరై చీర, సారె అందజేసి ఆశీర్వదించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కమలప్రియ, అదనపు సీడీపీఓ ఉషారాణి, హెడ్‌నర్స్ రాజేశ్వరి, లయన్స్‌క్లబ్ సభ్యులు చింతలపూడి వెంకటేశ్వరరావు, నంబూరి విజయరాణి, కన్యదారి హనుమాయమ్మ, సరిత, సత్యవతి, శ్రీధర్, చింతోజు నాగేశ్వరరావు, సీత, నీరజ, పుష్పలత, రాజారావు, దయామణి, అరుణ పాల్గొన్నారు.

చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వండి

సత్తుపల్లిరూరల్: ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇచ్చినట్‌లైతే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సత్తుపల్లి సీడీపీఓ ఎ.కొండమ్మ అన్నారు. కిష్టారం సెక్టార్ ఆధ్వర్యంలో పోషన్‌పక్వాడ్ కార్యక్రమాన్ని యాతాలకుంటలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసనలు, గర్భిణులకు సీమంతాలు, పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కొప్పుల రజిని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



శ్రీసింహాద్రి అప్పన్నస్వామి ఆలయ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామంలోని పేట చెరువు వద్ద నెలకొన్న శ్రీ సింహాద్రి అప్పన్న స్వామి ఆలయం వద్ద బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను జరిపించారు. మామునూరు, రాజులదేవరపాడు, లక్ష్మీపురం, అయ్యవారిగూడెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలివచ్చి పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల వితరణతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అంగరంగవైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ప్రతిష్ఠించిన కోదండ సీతారామచంద్రస్వామి



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు: మండలంలోని భీరపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కోదండ సీతారామ చంద్రస్వామి, లక్ష్మణ శీతాలాపరమేశ్వరి, నూతన శిలాధ్వజాంజనేయ, శివలింగ నందీశ్వర విగ్రహప్రతిష్ఠ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, కళాహోమములు, మహాపూర్ణహుతి, దృష్టి కుంభ, దర్శనం మంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెరటితోటల పెంపకంపై దృష్టి సారించాలి

ఏన్కూరు: పెరటితోటల పెంపకంపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, రేఖాభాయి కోరారు. మండల పరిధిలోని రాజలింగాల, జన్నారం అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు తక్కువ ఖర్చుతో ఎక్కుక పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలని, చిరుదాన్యల గురించి, ఆరోగ్య జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరస్వతి, ఏఎన్ఎం అరుణ పాల్గొన్నారు.

విజయలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎక్స్ఎల్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారిచే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం కంపెనీ సీఈఓ శ్రీరామ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్‌బాబులు నియమాక పత్రాలు అందించారు. ఎంపికైన 40 మంది విద్యార్థులకు రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలు ఏడాదికి ప్యాకేజ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ ఆర్.అవినాష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.చిన్నయ్య, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తరుణమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

తల్లాడ: విజయవాడ నుంచి ఖమ్మంకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. మిట్టపల్లి వద్ద ఎస్సై కొండల్‌రావు వాహనాలు తనిఖీలో భాగంగా ఇసుక లారీని పట్టుకున్నారు. లారీనీ స్టేషన్‌కు తరలించి డ్రైవరు బి.తిరుపతరావు, యజమాని బి.అప్పారావులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి అంకమ్మతల్లి తిరునాళ్లు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో ఈ నెల 21 తేది నుంచి 25వ తేది వరకు శ్రీఅంకమ్మ తల్లి, శ్రీఅక్కమ్మ పేరంటాళ్ల శ్రీరామలింగయ్య స్వామి వార్ల తిరునాళ్లు నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ వంశపారంపర్య అర్చకుడు వేమిరెడ్డి వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా 23వ తేదీ నుంచి ఖమ్మం, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల స్థాయి ఎడ్లబండి పోటీలు, 5న నాటు తరుగు గొర్రె పొట్టేళ్ళ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన టీమ్‌లు తమ ఎంట్రీలను గూడూరు వెంకటసత్యనారయణరెడ్డి 9908438525, కోనా రమేష్ 96408-54179లకు ఫోన్ చేసి సంప్రందించాలని కోరారు. ఎంట్రీలను ఈ నెల 22వ తేది సాయంత్రం 4గంటల కల్లా పంపాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ,ద్వితీయ, తృతీయ, బహుమతులు రూ.30వేలు, 25వేలు, 20వేలు నగదు అందచేస్తామని, వీటితో పాటు మరో ఏడుగురు విజేతలకు కూడా నగదు అందజేమని కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయినాధుడికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలంలోని పలు గ్రామాల భక్తులు సాయిబాబాను దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పెనుబల్లి: వియంబంజర్ రాజసాయి మందిరం నిర్వాహకుడు జెన్నారెడ్డి నరసింహారెడ్డి, ఖమ్మం మమత మెడికల్ కాలేజీ మరియు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుల సహకారంతో పెనుబల్లిలో ఈ నెల 22న నిర్వహించే వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని నరసింహారెడ్డి కోరారు. కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు నిపుణులైన వైద్యులుచే నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేయబడతాయని తెలిపారు. ఈ శిబిరం పెనుబల్లి పల్లపోతుల సావిత్రి-రామకృష్ణారావు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం

మధిర: మధిర మెయిన్‌రోడ్డు నందు గల వినాయకుని ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊర కల్యాణి కుమారుడు ఉజ్వల్, ఉదయలక్ష్మి మనుమడు సాయిలోకేష్ జన్మదినం సందర్భంగా వారు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

విజేతలకు బహుమతులు అందజేత

కారేపల్లి: మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలిపొందిన విజేతలకు బుధవారం బహుమతులను అందజేశారు. మొరిశెట్టి పరివార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి తలారి రాజేష్ గెలుచుకోగా.. రూ.5 వేలు, షీల్డు అందజేశారు. ద్వితీయ బహుమతి ఆదెర్ల శంకర్ రూ.2వేలు, షీల్డు గెలుచుకున్నారు. తృతీయ బహుమతి సురేందర్‌రెడ్డి, నాలుగో బహుమతి ఎస్.నరేష్, ఐదో బహుమతి ఎం.త్రివేణి, ఆరో బహుమతి రాజు గెలుచుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు జి.నారాయణ, తలారి అనీల్, ఎ.భాస్కర్ లు గెలుచుకున్నారు. బహుమతులను ప్రముఖ వ్యాపారి ఓరుగంటి రంగనాథ్ చేతుల మీదుగా అందజేశారు.

చలమాల గంగాధర్‌కు నివాళి

పెనుబల్లి: కామ్రేడ్ చలమాల గంగాధర్ 13వ వర్ధంతి వేడుకలను బుధవారం వియంబంజర్‌లో చలమాల గంగాధర్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి పాల్గొని గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్యలు, పాలకులు అనుసరిస్తున్న విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కలకోట చిన్న వెంకటేశ్వర్లు , జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, కాటినేని శ్రీనివాసరావు, ఎస్‌కె భాష, చలమాల నరసింహారావు, టి. చిరంజీవి, మిద్దె స్వామి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సాంబశివుడు, తదితరులు

కల్లూరు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ పులి సాంబశివుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటర్ నమోదుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. ఫోన్ యాప్ ద్వారా ఓటర్ గైడ్ సెర్చ్ యువర్ నేమ్, ఇన్ ది ఓటర్ లిస్ట్, ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లో ఫారమ్ 6బి, ఫారం 8, ఫారం 7ల గురించి వివరించి ఆన్‌లైన్ ద్వారానే మీ ఓటును అప్‌లై చేసుకోవచ్చునని సూచించారు. ఓటును దుర్వినియోగం చేసుకోకుండా సరైన రీతిలో ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ బాబ్జిప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామాల ప్రసాద్, నెహ్రూ యువజన కేంద్రం జిల్లా యువ అధికారి అన్వేష్ చింతల, అకౌంట్స్ ప్రోగ్రామ్ అధికారి కమర్తపు భానుచందర్, కోవెలాశ్రీ వెల్ఫేర్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కాసిన కిషోర్ కుమార్, పీఈటీలు పి.వీరరాఘవయ్య, త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుదాం



పర్యావరణ వేత్త చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: జీవ వైవిద్య సంరక్షణలో పిచ్చుకల పాత్ర కీలకమైనదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రముఖ పర్యావరణ వేత్త, జీవ వైవిద్య బోర్డు సభ్యుడు జేవీఎస్ చంద్రశేఖర్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం లయన్స్‌క్లబ్, ఎకోక్లబ్ ఆధ్వర్యాన ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిచ్చుకల ఉనికిని కాపాడుతూ జీవవైవిద్యాన్ని, సహజ ఆహారపు గొలుసులను సంరక్షించడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం పర్యావరణ వేత్త చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్, దారా కృష్ణారావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొడ్డా కృష్ణయ్య, ఎకోక్లబ్ కన్వీనర్ జి.వీరన్న, ఐక్యూ కోఆర్డినేటర్ పానెం రామచంద్రరావు, రాంబాబు, పీర్ సాహెబ్, రవికుమార్, ప్రభావతి, మురళి పాల్గొన్నారు.

దేవుడి పట్ల ప్రేమతో ఉండండి

ఘనంగా పునీత జోజప్ప మహోత్సవ వేడుకలు



దివ్యబలిపూజ సమర్పిస్తున్న కడప మేత్రాసనం ఫాదర్ పీటర్

తల్లాడ: తల్లాడ లూర్దుమాతా పుణ్యక్షేత్రంలో బుధవారం పునీత జోజప్ప మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కడప మేత్రాసనం ఫాదర్ పీటర్ వాక్యోపదేశం చేస్తూ దేవుని పట్ల ప్రేమతో ఉండాలన్నారు. ప్రభువు పాపుల కోసం ఎలా పరితపించారో పాపుల పట్ల మనం కూడా క్షమా గుణం కల్గి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పరిశుద్ధ సిలువమార్గం, దివ్యబలిపూజ, ధ్యానవడక ప్రార్ధన నిర్వహించారు. రాత్రి జాగరణ, భక్తి గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మరియన్న, ఫాదర్ మనోజ్, ఫాదర్ అజయ్, ప్రాంచీస్, చారిటీ సిస్టర్స్, ఉపదేశకులు, సంఘం పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు బుధవారం వైద్య సేవలు అందించారు. దీంతో పిల్లల్లో పరిపక్వత కనబడుతుందన్నారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. మానసిక పరిపక్వత లేని ముగ్గురు చిన్నారులను సికింద్రాబాద్‌లోని జాతీయ మానసిక వికలాంగుల సంస్థకు పంపించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకించండి



మాట్లాడుతున్న శిరోమణి

సత్తుపల్లిటౌన్: మతోన్మాదాన్ని, మనువాదాన్ని బలోపేతం చేస్తున్న కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి పిలుపునిచ్చారు. సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల హక్కులు, సమానత్వ సాధన కోసం లింగవివక్షతకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలన్నారు. రామరాజ్యం అంటూ హిందువులను రెచ్చగొడుతున్నారని, మనుధర్మ రాజ్యాంగాన్ని తేవడానికి సర్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను నొక్కివేస్తూ దేశద్రోహులంటూ జైళ్లల్లో నిర్బందిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత, డివిజన్ కార్యదర్శి జె.పరిమళ, వెంకటనర్సమ్మ, అలివేలు, దుర్గా, కోటమ్మ, చెల్లమ్మ, భద్రమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

పరామర్శ



రామారావుతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కొణిజర్ల: గత 20 రోజుల క్రితం హత్యాయత్నానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావును వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు.

తాటి ముంజలు వచ్చేశాయ్..



విక్రయానికి సిద్ధంగా ఉంచిన తాటి ముంజలు

మధిర: వేసవి కాలం సీజన్‌లో వచ్చే తాటి ముంజలు మార్కెట్లోకి వచ్చాయి. రోజురోజుకు ఎండలు పెరుగుతుండడంతో వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రజలు రకరకాల శీతల పానీయాలు, పండ్ల రసాలు, లస్సీ, కొబ్బరి బోండాలు వంటివి తీసుకుంటారు. మరికొందరు ఈ సీజన్‌లో ప్రత్యేకంగా వచ్చే తాటి ముంజలను తింటుంటారు. రుచికరంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి శ్రేష్టమైన తాటి ముంజలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తాటికాయలు తెచ్చుకుని మధిరలోని రైల్వే అండర్ బ్రిడ్జి, వైరా రోడ్డు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుండగా.. కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. డజన్ ముంజలు రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు.